తూత్తుకుడి మారణకాండ ను నిరసిద్దాం. ప్రజల సంక్షేమం పట్టని అభివృద్ధి అభివృద్ధే కాదు. అది విధ్వంసం

మిత్రులారా,

తూత్తుకుడి లో పోలీసులు జరిపిన కాల్పులలో 13 మంది చనిపోయారు. తూత్తుకుడి తమిళనాడులోని ఓ తీర ప్రాంత పట్టణం. అక్కడ రాగి తీగలు తయారు చేసే కర్మాగారాన్ని స్టెర్‌లైట్ కాపర్ పేరిట, వేదాంత రిసోర్సెస్ అనే కంపెనీ 1996 లో నెలకొల్పింది. దాని యజమాని అనిల్ అగర్‌వాల్. నరేంద్ర మోడీకి అత్యంత సన్నిహితుడు. ఈ ఫ్యాక్టరీ 1992 లా మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లాలో తిష్టవేసింది. రత్నగిరి జిల్లా అంటే ఆల్ఫోన్సా మామిడి పండ్లకు ప్రసిద్ధి. ఆ పండ్ల రుచి, సుగంధమే వేరు. రత్నగిరి జిల్లాలో ఈ ఫాక్టరీకి దగ్గరలో గల మామిడి తోటల్లో పండే పండ్లు తమ సహజత్వాన్ని కోల్పోయాయి. కారణాన్ని శోధిస్తే ఈ ఫ్యాక్టరీ నుంచి బయటికి వచ్చే కాలుష్యాలు అని తేలింది. అక్కడి రైతుల ఆందోళనతో మహారాష్ట్ర ప్రభుత్వం ఫ్యాక్టరీని అక్కడినుంచి సాగనంపింది. వేదాంత తూత్తుకుడి చేరింది.పర్యావరణ ప్రభావ మదింపు నివేదిక రాకన్నా ముందే పర్యావరణ అనుమతులను కట్టబెట్టారు అదికారులు. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం ఎంత లోతుగా చొచ్చుకు పోయిందో?! ఈ ఫాక్టరీ వెదజల్లే విషపూరిత వాయువులను పీల్చి, వ్యర్థాలతో కలుషితమైన నీటిని తాగి వందల మంది గర్భిణులు తమ కడుపు పంటను కోల్పోయారు. చిన్నపిల్లలు రకరకాల జబ్బుల పాలబడ్డారు. రోగి లేని ఇల్లు లేదంటే అతిశయోక్తి కాదు.

ఈ ఫ్యాక్టరీని మూసివేయమని కోరుతూ తూత్తుకుడి వాసులు గత రెండు దశాబ్దాలుగా శాంతియుత పద్ధతుల్లో ఆందోళన చేస్తున్నారు. ఫ్యాక్టరీ ఉత్పత్తిని ఇప్పుడున్న స్థాయికన్నా రెండు రెట్లు పెంచాలని యాజమాన్యం విస్తరణ ను చేపట్టింది. దాంతో తూత్తుకుడి వాసులు వంద రోజుల క్రితం ఆందోళనను మొదలెట్టారు. ప్రభుత్వంనుచి స్పందనే లేదు. ఉద్యమం వందవ రోజున కలెక్టరు ఆఫీసు వరకు భారీ ఊరేగింపు తీయబోతున్నామని ఆందోళనకారులు ముందే ప్రకటించారు. పదివేల మంది స్థానికులు దీక్షాశిబిరం వద్దకు మే నెల 22 న చేరుకున్నారు. ప్రభుత్వం 3000 మంది పోలీసులను మోహరించింది. శాంతియతంగా సాగిపోతున్న ఊరేగింపు పై పోలీసులు కాల్పులకు తెగబడ్డారు. కాల్పులను ఆదేశించింది ఎవరు అనేది ఇప్పటి వరకూ తేలలే.

పోలీసు కాల్పులలో 13 మంది చనిపోయారు, కాషాయ వంధిమాగధులు సంతోషంతో మంచిగయింది మంచిగయింది అంటున్నారు. చచ్చిపోయినవాళ్ళంతా తీవ్రవాదులని సోషల్ మీడియాలో ప్రచారానికి లంకించుకున్నారు,

ఈ వేదాంత కంపెనీకి పర్యావరణ నియమాలను తుంగలో తొక్కడం కొట్టిన పిండి. ఒడిషాలోని నియాంగిరి కొండల్లో దొరికే బాక్సయిట్ నిక్షేపాలను కొల్లగొట్టదానికి ఎన్నో అక్రమాలకు పాల్పడింది. కానీ ఆదివాసీల ప్రతిఘటన వల్ల తోకముడిచింది.

ప్రజల సంక్షేమం పట్టని ఆభివృద్ధి అభివృద్ధే కాదు. అది విధ్వంసమే. ప్రభుత్వాలు అమలు జరుపుతున్న అబివృద్ధి నమూనా ప్రకృతినీ, పర్యావరణాన్నీ విధ్వంసం చేసే నమూనా. పర్యావరణ విధ్వంసం అంటే మనిషికి స్వచ్ఛమైన గాలినీ, నీటినీ నిరాకరించడమే. అంటే మనిషిని నిండైన నీవితాన్ని జీవించనియ్యక పోవడమే. అంటే మనిషికి జీవించే హక్కును నిరాకరించడమే. ఒక్క మాటలో చెప్పాలంటే నేడు పాలకులు అమలు జరుపుతున్న అభివృద్ధి నమూనా మానవ హక్కుల హననానికి దోహదం చేస్తుంది. ఈ హక్కుల హననాన్ని ఇంకేమాత్రమూ కొనసాగనివ్వమని తూత్తుకుడి ప్రజలు చేసిన ప్రతిఘటన, ప్రాణత్యాగం దేశప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తాయి. తూత్తుకుడి పోరాటానికి సంఘీభావం తెలుపుదాం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుదాం. మృతుల వారసులకు కోటి రూపాయల పరిహారం చెల్లించమని ఆడుగుదాం. వేదాంతకు శాశ్వతంగా చరమ గీతం పాడమని ప్రభుత్వాన్ని డిమాండ్ చేద్దాం.

25-5-2018

మానవ హక్కుల వేదిక ( H R F ) నిజామాబాద్ జిల్లా శాఖ